రూ.400 ఇసుక 2వేలు!

- టీజీఎండీసీలో భారీ కుంభకోణం..
- ప్రభుత్వ సంస్థల పేరుతో బుకింగ్
- ఆన్‌లైన్ లొసుగులతో కృత్రిమ కొరత
- లోడింగ్‌కూ వెయ్యి చొప్పున వసూలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ)లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. అధికారుల 'అమ్యామ్యాల' కారణంగా రూ.400 ఉన్న టన్ను ఇసుక ధర.. వినియోగదారుకు చేరేసరికి రూ.2000 దాటుతున్నది. వర్షాల సీజన్‌లో ఈ ధర మరింత పెరుగుతున్నది. ఆన్‌లైన్‌లో లొసుగులను ఆసరాగా అధికారులు, దళారులు కుమ్మక్కై ఇసుక దందా యథేచ్ఛగా సాగిస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును జేబుల్లో నింపుకొంటున్నారు.

గాడి తప్పిన ఆన్‌లైన్ విధానం

ఇసుక వ్యాపారంలో అక్రమాలు అరికట్టేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. దళారుల ప్రమేయం లేకుండా టీజీఎండీసీ వెబ్‌సైట్‌కు వెళ్లి ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ఇసుకను ఇంటికి చేర్చడం దీని ముఖ్యోద్దేశం. ప్రభుత్వం మారిన తర్వాత ఈ వ్యవస్థ గాడితప్పింది. ప్రస్తుతం టన్ను ఇసుకను టీజీఎండీసీ రూ.406కు విక్రయిస్తుండగా, రవాణా ఖర్చులు కలుపుకొని టన్ను రూ.800 నుంచి 1000 వరకు అందాలి. కానీ, రూ.1800 నుంచి కొన్ని సందర్భాల్లో రూ. 2,500 వరకూ వినియోగదారు చెల్లించాల్సి వస్తున్నది. టన్ను ఇసుకపై రూ.1000 నుంచి రూ.1500 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఎవరైనా నేరుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని తెచ్చుకుందామంటే.. దళారులు లేనిదే బుకింగ్ సాధ్యం కాదు. కొన్ని ఎంపికచేసిన మీ-సేవా కేంద్రాల్లో 'బాట్ సాఫ్ట్‌వేర్' ద్వారానే బుక్ అవుతుంది. బుకింగ్ కోసం దళారులకు రూ. 5000 చొప్పున సమర్పించుకోవాలి. స్టాక్‌యార్డ్‌ల వద్ద ఉచితంగా లోడ్ చేయాల్సి ఉన్నా అక్కడ ఒక్కో ట్రిప్పునకు రూ.1000 సమర్పించాలి. ఈ అక్రమ వసూళ్లను నిలిపివేయాలని, తమకే బుకింగ్ వెసులుబాటు కల్పించాలని ఇటీవల లారీ యజమానులు టీజీఎండీసీ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు.

బల్క్ బుకింగ్‌ల పేరుతో భారీ మోసం

పెద్ద మొత్తంలో ఇసుక అవసరమైన ప్రభుత్వ సంస్థలు, ప్రైవేట్ బిల్డర్లు, కాంట్రాక్టర్లు బల్క్‌గా బుక్ చేసుకునే వీలుంది. నిర్ధారిత ధర చెల్లించి వారు బుక్ చేసుకున్న పరిమాణం వరకు ఇసుక రవాణా చేసుకోవచ్చు. ఇదే టీజీఎండీసీలోని కొందరు అధికారులు, దళారులకు వరంలా మారింది. ప్రభుత్వ, ప్రైవేట్ బిల్డర్ల పేరుతో భారీగా ఇసుక బుక్ చేసుకొని అధిక ధరకు లారీ యజమానులకు విక్రయిస్తున్నారు. గత ఆగస్టు ఆరో తేదీన కొందరు దళారులు వాటర్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పేరుతో 1.4లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక బుక్ చేయగా, వాస్తవాలను పరిశీలించకుండానే టీజీఎండీసీ అధికారులు మూడు రోజుల్లోనే మంజూరు ఇచ్చారు. బుక్ చేసుకున్న దళారులు ఆ ఇసుకను దాదాపు 150 మంది లారీ యజమానులకు అధికరేటుకు విక్రయించగా, ఇప్పటికే సుమారు 40వేల మెట్రిక్ టన్నుల ఇసుకను లారీ యజమానులు రవాణా చేశారు. ఈ మధ్య విషయం బయటకు పొక్కి వాటర్‌బోర్డు నుంచి ఎలాంటి ఇసుక బుకింగ్ లేదని టీజీఎండీసీ ఉన్నతాధికారులకు తెలియడంతో వెంటనే వారు తాము ఇచ్చిన మంజూరును రద్దుచేశారు. దీంతో దళారులకు 1.4లక్షల టన్నులకు డబ్బులు చెల్లించిన లారీ యజమానులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఇసుక మంజూరు రద్దయినందున తాము దళారులకు చెల్లించిన మొత్తాన్ని వాపస్ ఇవ్వాలని, లేకుంటే ఇసుకను రవాణా చేసుకునే వెసులుబాటు కల్పించాలని టీజీఎండీసీని కోరుతున్నారు.

బల్క్ బుకింగ్‌లు నిత్యకృత్యం

టీజీఎండీసీలో బల్క్ బుకింగ్‌ల బాగోతం ఎంతోకాలంగా కొనసాగుతున్నది. ఇప్పుడు వెలుగులోకొచ్చింది మచ్చుకు ఒక్కటి మాత్రమే. అధికారులు, దళారులు కుమ్మక్కై బల్క్ బుకింగ్ చేయడం, అనంతరం లారీ యజమానులకు అధికరేటుకు విక్రయించడం మామూలే అని లారీ యజమానులు చెప్తున్నారు. తాజాగా వ్యవహారం బయటకు పడి మంజూరు రద్దవడంతో వివాదం తలెత్తిందని, లేదంటే ఇది ఎప్పటిలానే కొనసాగేదని పేర్కొంటున్నారు. తాము సొంతంగా బుక్ చేసుకునే అవకాశం లేదని, ఒక్కో ట్రిప్పుకు రూ.5000 వరకు దళారులకు సమర్పిస్తేనే తమకు ఇసుక మంజూరు లభిస్తున్నదని, కొందరు అధికారులు, దళారులు కుమ్మక్కై ఈ దందా కొనసాగిస్తున్నారని వాపోతున్నారు. టీజీఎండీసీ ద్వారా ప్రతి నెట సగటున వానకాలంలో అయితే 20లక్షల మెట్రిక్ టన్నులు, మిగిలిన కాలాల్లో 40లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. టీజీఎండీసీ టన్ను ఇసుకు రూ.406కు విక్రయిస్తుంటే, వినియోగదారుల రూ. 2000చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తున్నది. దీన్నిబట్టి దోపిడీ ఏ స్థాయిలో ఉన్నదదో అర్థం చేసుకోవచ్చు.

మరో రెండురోజులు వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరో రెండు రోజులుపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కుమ్రంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, ఆదిలాబాద్, మహబూబాబాద్, నిర్మల్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, జయశంకర్‌భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ, జనగామలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

పంటల్లో జన్యుమార్పిడిని వ్యతిరేకిద్దాం

- దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘాల నిర్ణయం

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ) : సహజత్వానికి భిన్నంగా పంటల్లో జరిగే జన్యుమార్పిడిని వ్యతిరేకించాలని, ఈ విధానం నిలిపివేతకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జన్యుమార్పిడి పంటలపై దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘం నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో జన్యుమార్పిడి విధానాన్ని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. జన్యుమార్పిడితో రైతులు విత్తన స్వాతంత్ర్యం కోల్పోవడమే కాకుండా విత్తనాలు కార్పొరేట్ రంగం చేతుల్లోకి వెళ్తాయని ఆవేదన వ్యక్తంచేశారు. జన్యుమార్పిడి పంటల మూలంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతిన డంతోపాటు పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇదే విషయంపై దేశవ్యాప్తంగా రైతులతోపాటు వినియోగదారులను కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జన్యు మార్పిడి పంటల ఆలోచన విధానానికి స్వస్తి పలికేలా ముందుకుసాగుదామని నిర్ణయించారు. సమావేశంలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

చితికిన చేనేత.. ఏదీ చేయూత?

- నేతన్నకు మళ్లీ గుండెకోత
- ఆర్థికంగా కోలుకోలేని దెబ్బలు
- పదేండ్లు ప్రశాంతం.. పది నెలల్లో జీవితాలు ఛిద్రం
- చేనేత కార్మికుల సమస్యలు పట్టని సర్కారు
- గతంలో మాదిరి చీరల తయారీ అప్పగించాలని వేడుకోలు
- 'చేనేత చేయూత'లో డబ్బులు జమచేయాలని నాయకుల డిమాండ్

> చేనేతల బతుకులు మళ్లీ ఛిద్రమవుతున్నాయి.. చేయూతనందించాల్సిన సర్కారు ఏమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నది. పదేండ్లపాటు కేసీఆర్ చేనేత రంగానికి సంక్షేమ రంగులు అద్దితే.. కొత్తగా వచ్చిన సర్కారు పది నెలల్లో నేతన్నను కోలుకోలేని దెబ్బతీసిందని సర్వత్రా మండిపడుతున్నారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): పది నెలలుగా చేనేత కార్మికులు ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారు. సరైన గిరాకీ లేక ఆర్థికంగా చితికిపోతున్నారు. రాష్ట్రంలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చేనేత రంగాన్ని సర్కారు పూర్తిగా విస్మరించినట్లు సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నల ఆర్థిక పరిస్థితులు దయనీయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో మాదిరిగా ప్రస్తుత ప్రభుత్వం చేనేత కార్మికులకు పని కల్పించడం లేదని వాపోతున్నారు. పదేండ్ల క్రితం నాటి అవస్థలు మళ్లీ మొదలయ్యాయని మదనపడుతున్నారు. ఉపాధి కరువవ్వడంతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు దాపురించాయని చేనేత కార్మిక సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేయూతనివ్వాల్సిందే..

పది నెలలుగా సరైన గిరాకీ లేకపోవడంతో 'చేనేత చేయూత' పథకం కింద రికరింగ్ డిపాజిట్ ఖాతా-1 అకౌంట్‌లో నెలవారీగా కార్మికులు డబ్బులు జమ చేయలేకపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5000 మందికి పైగా చేనేత కార్మికులది ఇదే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఆర్‌డీ-1 అకౌంట్‌లో ప్రస్తుతం జమ చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఇలా చేస్తే ఆర్‌డీ-2 అకౌంట్ నుంచి డబ్బుల మొత్తం డబుల్ అవుతాయి. రూ.2000 జమ చేస్తే, తిరిగి రూ.4000 నేతన్న ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుంది. ఈ విధానానికి అవకాశం కల్పించాలని హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ శాఖ అధికారులు, ప్రభుత్వాన్ని చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేనేత మిత్ర పథకం ద్వారా నూలు సబ్సిడీ 40శాతంతో నేరుగా వీవర్‌కు రూ.2వేలు, వర్కర్‌కు రూ.500 అందించింది. ఈ పథకం ద్వారా 2023 అక్టోబర్ వరకు నేతన్నలకు లబ్ధి చేకూరింది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నూలుకు ఎలాంటి రాయితీ ఇవ్వడం లేదు.

నేతన్నల డిమాండ్లు ఇవే..

- చేనేత మిత్ర పథకాన్ని అమలు చేయాలి. నవంబర్ నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించాలి.
- చేనేత రుణమాఫీ రూ.2లక్షల వరకు వర్తింపజేయాలి. మాఫీ లబ్ధి పొందని వారికి నగదు సాయం చేయాలి.
- 80 ఏండ్ల వయసు ఉన్న నేతన్నలకు ఇన్సూరెన్స్ పథకం వర్తింపజేయాలి.
- చేనేత కార్మికుల వద్ద నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేసి ఆదుకోవాలి.
- డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలి. ఇంటి స్థలం ఉంటే రూ.5లక్షల ఆర్థిక సాయం చేయాలి.

ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలం

- స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ డాక్టర్ గోపీచంద్

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె జబ్బులకు దూరంగా ఉండొచ్చని స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ పద్మశ్రీ డాక్టర్ గోపీచంద్ మన్నం అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకొని జూబ్లీహిల్స్‌లోని హోటల్ దసపల్లాలో ఆదివారం హార్ట్ టు హార్ట్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాన్ని డాక్టర్ గోపీచంద్, జాయింట్ ఎండీ డాక్టర్ రమేశ్ గూడపాటి, ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ హాస్యనటుడు పద్మశ్రీ బ్రహ్మానందంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ 16 ఏండ్ల అనుభవంలో మా దవాఖానలో ఐదు లక్షల మంది రోగులకు విజయవంతంగా చికిత్స చేశామన్నారు. 43వేల గుండె శస్త్రచికిత్సలు, 7వేల పీడియాట్రిక్ హార్ట్ సర్జరీలు చేశామని, కార్డియాక్ సర్జరీల్లో 99.8 శాతం సక్సెస్ రేటు సాధించామని వెల్లడించారు.

హాస్యనటుడు బ్రహ్మానందంకు జ్ఞాపికను అందజేస్తున్న స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ పద్మశ్రీ డాక్టర్ గోపీచంద్ మన్నం, తదితరులు

సీపీఎం జాతీయ కార్యదర్శి ఎన్నికకు ముహూర్తం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): ఇటీవల అనారోగ్యంతో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి చెందారు. ఆ పోస్టును ఎవరికి ఇస్తారనే చర్చ ప్రస్తుతం జోరుగా సాగుతున్న క్రమంలో.. సీపీఎం జాతీయ కార్యదర్శి ఎన్నికకు ముహూర్తం ఖరారు చేసినట్లు ప్రకటించారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో సీపీఎం 24వ అఖిలభారత మహాసభలు మధురైలో జరగనున్నాయి. ఈ అఖిలభారత మహాసభల్లో సీపీఎం నూతన ప్రధాన కార్యదర్శి ఎన్నిక ఉంటుందని, కొత్త ప్రధాన కార్యదర్శి ఎన్నిక వరకు పొలిట్‌బ్యూరోకు, సెంట్రల్ కమిటీకి.. సమన్వయకర్తగా ప్రకాశ్‌కారత్ వ్యవహరించనున్నట్లు సీపీఎం వర్గాలు తెలిపాయి.

9 ఏండ్ల బాలికపై లైంగికదాడి

- నిందితుడి ఇంటికి గ్రామస్థుల నిప్పు
- సిద్దిపేట జిల్లా గురువన్నపేటలో ఉద్రిక్తత
- గ్రామంలో 144 సెక్షన్ విధించిన పోలీసులు
- బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పల్లా పరామర్శ

కొమురవెల్లి, సెప్టెంబర్ 29: బాలికపై ఓ ట్రాక్టర్ డ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, బాలిక తల్లిదండ్రులు నిందితుడి ఇంటికి నిప్పుపెట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఘటన ఆదివారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేటలో చోటుచేసుకుంది. గురువన్నపేట ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న బాలిక(9) శుక్రవారం ఇంట్లో తన చెల్లెళ్లతో ఆడుకుంటున్నది. అదే సమయంలో పక్క ఇంట్లో ఉండే ట్రాక్టర్ డ్రైవర్ ఎండీ షర్ఫుద్దీన్(20) ఇంట్లోకి ప్రవేశించి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. విషయం ఎవరికీ చెప్పొద్దని బాలికను బెదిరించాడు. దీంతో భయపడిన బాలిక ఇంట్లో ఎవరికీ చెప్పలేదు. శనివారం బాలిక అలసటగా ఉండటంతో రాత్రి కుటుంబ సభ్యులు ఏమైందని అడగగా సైకిల్‌పై నుంచి పడినట్టు చెప్పింది. వెంటనే విషయాన్ని బాలిక చెల్లెళ్లు తల్లిదండ్రులకు తెలుపడంతో వారు 100కు ఫోన్ చేశారు. చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆదివారం ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్థులు నిందితుడి ఇంటి వద్దకు చేరుకున్నారు. నిందితుడి ఇంటికి నిప్పు అంటించి వాహనాలను ధ్వంసం చేశారు. వెంటనే పోలీసులు మంటలను అదుపులోకి తెచ్చారు. గ్రామంలో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, 144 సెక్షన్ విధించారు. జిల్లా డీసీపీ(అడ్మిన్) మల్లారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి వెంటనే సీపీ అనురాధకు ఫోన్ చేసి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బాలిక తల్లితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బీజేపీ నాయకులు భారీగా తరలివచ్చి గ్రామంలో ఆందోళన నిర్వహించారు.

ఫోక్ సింగర్ మల్లిక్ తేజపై కేసు

లైంగికదాడికి యత్నించాడని సహచర గాయని ఫిర్యాదు

మల్లిక్ తేజ

జగిత్యాల కలెక్టరేట్, సెప్టెంబర్ 29: జానపద సింగర్, రైటర్ మల్లిక్‌తేజ తనపై లైంగిక దాడికి యత్నించాడని సహచర గాయని ఆదివారం జగిత్యాలలోని టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. జగిత్యాల జిల్లా చిన్నాపూర్‌కు చెందిన సింగారపు మల్లేశం అలియాస్ మల్లిక్‌తేజతో కలిసి ఆరేండ్ల క్రితం ఓ యూట్యూబ్ చానల్ ప్రారంభించి పాటలు పాడుతున్నామని, చానల్ మంచి ఆదరణ పొంది లక్షల వ్యూస్ రావడంతో ఆదాయం సైతం భారీగా వచ్చేదని తెలిపింది. తనకు కొంత నగదు మాత్రమే ఇవ్వడంతో మరో యూట్యూబ్ చానల్ ప్రారంభించానని, తనకు తెలియకుండానే యూట్యూబ్ చానల్ పాస్‌వర్డ్, 2 లక్షల వ్యూస్ ఉన్న ఇన్‌స్టాగ్రామ్ పాస్‌వర్డ్‌లను సైతం మార్చివేధించాడని, తరచూ ఫోన్‌చేసి పెండ్లి చేసుకోవాలని బెదిరిస్తున్నాడని పేర్కొన్నది. జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయానికి వచ్చి లైంగికదాడికి యత్నించాడని, తనపై స్వగ్రామంలో దుష్ప్రచారం చేస్తూ వేధిస్తున్నాడని మహిళా సింగర్ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మల్లిక్‌తేజపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

గోదావరిలో యువకుడి గల్లంతు

ధర్మపురి రూరల్, సెప్టెంబర్ 29: దుర్గామాత మాలాధరణ కోసం గోదావరిలో పుణ్యస్నానం చేసేందుకు వచ్చిన ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు ఆదివారం వరదలో కొట్టుకుపోయారు. గమనించిన జాలర్లు ఇద్దరిని కాపాడగా.. ఒకరు గల్లంతయ్యారు. దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గామాత మాలధారణ కోసం జగిత్యాల జిల్లా రాయపట్నం వద్ద గోదావరి నదిలో పుణ్యస్నానం చేసేందుకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రాగుల పవన్‌కుమార్, స్నేహితులు కొట్టె నవిత్‌వర్మ, బొగే అశ్విన్ కలిసి ద్విచక్రవాహనంపై వచ్చారు. మధ్యాహ్నం 2.30 గంటలకు గోదావరి నదిలో స్నానం చేస్తుండగా.. వరద ఉధృతంగా ప్రవహించడంతో ముగ్గురు కొట్టుకుపోయారు. వెంటనే అక్కడున్న జాలర్లు గమనించి కొట్టె నవిత్‌వర్మ, బొగే అశ్విన్‌ను కాపాడారు. రాగుల పవన్ కుమార్ కొట్టుకుపోయాడు. అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. పవన్‌కుమార్ తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ధర్మపురి ఎస్సై గంగుల మహేశ్ తెలిపారు.

గురుకుల సమస్యల పోరాటానికి తాత్కాలిక బ్రేక్

- దసరా తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తాం
- ప్రభుత్వానికి గురుకుల టీచర్ల జేఏసీ హెచ్చరిక

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని 1,022 గురుకులాల్లో నెలకొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సమస్యల పరిష్కారం కోసం టీచర్లు గత రెండు వారాలుగా వివిధ పద్ధతుల్లో పోరాటాలు చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యాసంస్థలకు దసరా సెలవులు రావడంతో ప్రస్తుతం తమ పోరాటాలకు తాత్కాలిక బ్రేక్ వేసినట్టు గురుకుల టీచర్ల జేఏసీ తరఫున టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు జంగయ్య, చావి రవి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గురుకులాల్లో సమస్యలు పెరిగిపోయాయని, వాటి పరిష్కారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. గురుకుల్లాలో కొత్త టైంటేబుల్ అమలు, అద్దె భవనాల్లో గురుకులాల కొనసాగింపు తదితర సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాల్సిన అవసరం ఉందని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. దసరా సెలవుల తర్వాత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా ఇద్దరు రైతులు మృతి

జడ్చర్ల, సెప్టెంబర్ 29 : విద్యుత్తు స్తంభాలు తీసుకెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడగా.. ఇద్దరు రైతులు మృతి చెందారు. ఈ ఘటన ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్‌లో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. జడ్చర్ల మండలం చిన్న ఆదిరాలకు చెందిన రైతులు బోరు బావుల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసేందుకు జడ్చర్ల నుంచి ట్రాక్టర్‌లో స్తంభాలను తీసుకెళ్తున్నారు. గంగాపూర్ ప్రధాన రహదారిపై అదుపుతప్పి ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడగా.. ట్రాలీలో కూర్చున్న రైతులు పెరుమళ్ల జంగయ్య, ఎద్దుల జంగయ్యపై స్తంభాలు పడ్డాయి. దీంతో పెరుమళ్ల జంగయ్య (60) అక్కడికక్కడే మృతి చెందగా, ఎద్దుల జంగయ్య(40) మహబూబ్‌నగర్‌లోని ఓ దవాఖానలో చికిత్స పొందుతూ మరణించాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

పోలీసు స్టేషన్ల నిర్వహణకు పైసల్లేవ్?

కొన్ని నెలలుగా మెయింటెనెన్స్ అలవెన్సుల బకాయి

- జంట నగరాల్లో ప్రతి స్టేషన్‌కు నెలకు రూ.75 వేలు
- జిల్లా కేంద్రాల్లోని స్టేషన్లకు నెలకు రూ.50 వేలు
- మండల కేంద్రాల్లోని స్టేషన్లకు నెలకు రూ.25 వేలు
- ఇప్పటికే రూ.కోట్లు పెండింగ్.. ప్రభుత్వం విడుదల చేయక ఖర్చుల కోసం పోలీసుల సతమతం
- స్టేషన్‌కు వచ్చేవారి డబ్బులపై మళ్లీ ఆధారం

హైదరాబాద్, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కొన్ని పోలీస్ స్టేషన్లలో మళ్లీ నేతలు ఇచ్చే డబ్బుల కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితులు వచ్చాయి. స్టేషన్‌కు వచ్చినవాళ్లు ఎంతోకొంత చేతిలో పెట్టకపోతారా? ఈ నెలకు సరిపడా ఛాయ్‌లు, బిస్కెట్లు, పనోళ్లకు డబ్బులు, ఇతర అవసరాలు తీరకపోతాయా? అంటూ కొందరు పోలీసు అధికారులు వేయికండ్లతో ఎదురుచూసే దుస్థితి వచ్చింది. స్టేషన్‌లో ఉండే నిందితులకు తిండి కూడా పెట్టలేకపోతున్నారు. పందేండ్లలో ఎప్పుడూ లేనిది.. మళ్లీ పాత రోజుల్లో అడిగినట్టు.. 'ఏంటన్నా ఏమీ ఇవ్వకుండానే వెళ్తున్నావ్' అనే దారుణ పరిస్థితికి వచ్చారు. కారణం.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల పోలీసు స్టేషన్ల ఖర్చుల కోసం నిధులు విడుదల చేయకపోవటమే. అవును.. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ స్టేషన్ల మెయింటెనెన్స్ కోసం ప్రతి నెల ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వటం లేదు. దీంతో పోలీస్ స్టేషన్ ఖర్చుల కోసం పోలీసు అధికారులు మళ్లీ నేతలు ఇచ్చే దక్షిణలపైనే ఆధారపడుతున్నారు. కొందరు ఆ డబ్బులను సొంతానికి సైతం వాడుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బీఆర్ఎస్ హయాంలో ప్రతి నెల మెయింటెనెన్స్ అలవెన్స్

రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోలీస్ స్టేషన్ నిర్వహణకు ప్రభుత్వాలు ఎలాంటి డబ్బులు ఇచ్చేవి కావు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పోలీసులు సైతం ఎంతోకొంత వసూలు చేయాల్సి వచ్చేది. ఇది కాస్తా.. స్టేషన్ ఖర్చుల కోసం పట్టిపీడించే స్థాయికి వచ్చింది. అయితే, ఆ దుస్థితి నుంచి పోలీసు వ్యవస్థను బయటపడేసేందుకు కేసీఆర్ సర్కారు.. రాష్ట్రంలోని ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ప్రతి నెల మెయింటెనెన్స్ కింద డబ్బులు కేటాయించింది. హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయం నుంచి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ఎక్కడో సరిహద్దుల్లో ఉండే మండల పోలీస్‌స్టేషన్‌కు కూడా క్రమం తప్పకుండా డబ్బులు విడుదల చేసింది. దీంతో ఖర్చుల కోసం స్టేషన్‌కు వచ్చే వారిని పీడించడం తగ్గిపోయింది. జంట నగరాలలోని ఒక్కో పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.75 వేలు, జిల్లాకేంద్రాలలో ఒక్కో పోలీస్ స్టేషన్‌కు రూ.50 వేలు, మండల కేంద్రాలలోని ఒక్కో పోలీస్ స్టేషన్‌కు నెలకు రూ.25 వేలు మంజూరు చేశారు. ఈ పద్ధతి తెలంగాణలో మినహా మరే రాష్ట్రంలోనూ లేదు.

కొన్ని నెలలుగా నిధులు పెండింగ్

పోలీస్ స్టేషన్ల నిర్వహణకు ప్రస్తుతం ప్రభుత్వం కొన్ని నెలలుగా నిధులు విడుదల చేయకపోవటంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ పెండింగ్ నిధులు కొన్ని కోట్ల రూపాయల వరకు ఉన్నట్టు తెలిసింది. బీఆర్ఎస్ హయాంలో కట్టిన కొత్త పోలీస్ స్టేషన్లు, జిల్లా పోలీస్ స్టేషన్లు, కమిషనరేట్లు, ఎస్పీ ఆఫీసులు చూడ్డానికి ఇంద్రభవనాల్లా ఉన్నా.. పోలీసులు మళ్లీ కక్కుర్తికొద్దీ చేతులు చాస్తుండటంతో కొందరు నేతలు 'ప్రతి నెల మేం ఇవ్వాలా?' అని కొన్ని స్టేషన్లలో ఎదురు ప్రశ్నించే స్థితికి పరిస్థితి దిగజారిందని వాపోతున్నారు. 'ఏ పోలీస్ స్టేషన్ చూసినా ఏమున్నది గర్వకారణం.. మళ్లీ డబ్బులు అడుక్కునే దుస్థితికి దిగజారినం' అని కొందరు నిజాయితీపరులైన అధికారులు చెప్తున్నారు.

ఆర్టీఐ కమిషనర్ల నియామకమెప్పుడు?

- పదినెలలైనా ప